## "డాడీ!"

చదువుతున్న న్యూస్‌పేపర్లోంచి తలెత్తి కొడుకు మొహంలోకి చూసాడు గురుమూర్తి.

ఆ చూపుల్లో 'నువ్వేం చెప్పబోతున్నావో తెలుసులే' అన్న భావం వుంది. 'ఇంతకన్నా నువ్వు నన్నేం చేస్తావులే' అనే నిర్లక్ష్యం కూడా ఉంది. తననీ, తన బిడ్డని ఒంటరివాళ్లని చేసి భార్య ఈ లోకాన్ని విడిచిపోతే అన్ని సుఖాలు వదులుకుని కంటికి రెప్పలా కాపాడుతూ పెంచి పెద్ద చేసింది వీడినా అనే ఛీత్కారం ఉంది.

గురుమూర్తికి అరవై ఏళ్లుంటాయి. ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేసి రిటైరయ్యాడు. గురుమూర్తికి ఒక్కగానొక్క కొడుకు గోపి. స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నాడు.

"డాడీ! నేనూ రమ్యా రాత్రి మీ గురించి ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాం" అన్నాడు గోపి.

కొడుకు చెప్పబోయేది ఏమిటో ముందే తెల్సు కాబట్టి పెద్దగా స్పందించలేదు గురుమూర్తి. రాత్రి జరిగిన సంఘటన లీలగా కళ్ల ముందు కదలసాగింది.

రాత్రి భోజనాలయ్యాక తన గదిలో పడుకున్నాడన్నమాటేగానీ గురుమూర్తికి నిద్ర రావడం లేదు.

భార్య జ్ఞాపకాలతో బ్రతుకు బండి భారంగా దొర్లుతున్నట్లు అనిపించింది. కొడుకు బెడ్రూమ్ లోనుంచి వస్తున్న మాటలు లీలగా వినిపించసాగాయి.

"ఎన్నిసార్లు చెప్పినా మామయ్యగారు తన అలవాటు మార్చుకోవడంలేదండీ"

"బయట ఎక్కడో కదా ఆయన చుట్టలు కాల్చేది. పిల్లలకెలా ప్రాబ్లం అయింది?"

"బయట ఎక్కడో తాగితే ఈ గోలంతా దేనికి? ఆ బాత్రూమ్ కాల్చొద్దు అంటే వినరు. పిల్లలు స్నానానికి వెళ్లాలంటే ఆ వాసన భరించలేకపోతున్నారు"

"అవును... నాకూ ఆ విషయంలో బాధగానే ఉంది. కానీ ఏం చేస్తాం చెప్పు?"

"అది కాదండీ... పిల్లలకోసం తెచ్చి పెట్టుకున్న తినుబండారాలు మామయ్యగారే తినేస్తున్నారు. అదేమంటే 'నేను షుగర్ పేషెంట్‌ను. తినకపోతే నీరసంగా వుంటుంది' అంటారు."

"అయితే ఏం చేద్దామో చెప్పు."

"ఈ ఊళ్లో కొత్తగా పెట్టిన వృద్ధాశ్రమం మా ఫ్రెండ్ జయలక్ష్మిదేనండీ. ఆయన్ను అక్కడ చేరిస్తే పోలా?"

"అయితే కనుక్కో. అలాగే చేద్దాం."

గురుమూర్తి హృదయం బాధతో మూలిగింది. ఆ రాత్రి శివరాత్రే అయింది.

***

గురుమూర్తి కనిపించకుండాపోయి అప్పటికి వారంరోజులయింది. ఆ వారం రోజుల నుంచి గోపికి కంటి నిండా నిద్ర, కడుపు నిండా తిండీ, మనసుకు శాంతి లేకుండా పోయాయి. ఏదో తెలియని మనోవ్యధ మనసుని ఆక్రమించి అతడ్ని పిచ్చివాడ్ని చేయసాగింది. నాన్న ఎక్కడున్నాడో... అనే జవాబులేని ప్రశ్నలతో సతమతమైపోసాగాడు. తండ్రి తనకు దూరం కావడానికి కారణమైన భార్యపై ఆగ్రహం ముంచుకొస్తోంది గోపికి.

ఎవరో తలుపు తట్టిన శబ్దం కావడంతో వెళ్లి తలుపు తీసాడు గోపి.

ఎదురుగా మురళీ మాస్టారు. ఆయన పక్కనే అతని తండ్రీ కనిపించారు.

వారంరోజులకే ఏమాత్రం గుర్తు పట్టలేనంతగా మారిపోయింది గురుమూర్తి ఆకారం. మాసిన బట్టలు, పెరిగిన గడ్డం, లోతుకు పీక్కుపోయిన మొహంతోవున్న తండ్రిని చూసేసరికి దుఃఖం ముంచుకొచ్చింది.

"గోపీ! వయస్సు పైబడ్డవారు అప్పుడే కళ్లు తెరిచిన పసిపిల్లలతో సమానమయ్యా. వాళ్లకి వున్న అలవాట్లు అప్యాంచుకోవడం కాదు, పసిపిల్లలకి చెప్పినట్లు చెప్పి మన దారిలోకి తెచ్చుకోవాలి. అంతేకానీ వాళ్ల అలవాట్లు నచ్చలేదని వృద్ధాశ్రమానికి పంపించివేయడం అవివేకం. ఈ




వారంరోజులు మీ నాన్న నా దగ్గరే వున్నారు. ఇక ముందు ఎప్పుడైనా మీ నాన్న బరువని నువ్వనుకుంటే మీ నాన్నను నాకు అప్పగించు. ఆయన బతకడానికి నేనే ఏర్పాటు చేస్తాను"

మురళీ మాస్టారు మాటలతో గోపీ కళ్లు తెరుచుకున్నాయి.

ఎంత నిగ్రహించుకున్నా ఆగకుండా కళ్ల వెంట కన్నీటి ధార. ఆప్యాయంగా తండ్రిని గుండెలకు హత్తుకున్నాడు గోపి.

తన తొందరపాటుతనానికి సిగ్గుతో తల దించుకుంది రమ్య.

☆